| ప్రశ్నలు... | ఔను 1 | కాదు 2 |
|---|---|---|
| 8 జిల్లాబోర్డుల రద్దుకు కారణం... | ప్రెసిడెంటు పాలన | రామరాజ్య స్థాపన |
| 9 ఆంధ్రలో విద్యావంతులు తక్కువ ఎందు చేత... | విశ్వవిద్యాలయాల నిక్కచ్చి | చదివే విద్యార్థుల చేవ |
| 10 కమ్యూనిస్టు లీమధ్య చల్లబడ్డారు... | పదవులు రావడంచేత | సాధించవలసినవి సాధించారని |
| 11 క్వాలిఫికేషన్ అక్కర్లేని ఉద్యోగాలు... | మంత్రి పదవులు | ప్రజా నాయకత్వం |
| 12 సంజీవరెడ్డి నాగిరెడ్డిగార్ల సంబంధం... | నాయక ప్రతినాయకత్వం | బావమరదులు |
| 13 కర్నూలు శాశ్వత రాజధాని... | స్థానిక విలువల చేత | చల్లబడ్డ రాజకీయాలవల్ల |
| 14 మద్యనిషేధం, దేవదాసీచట్టం...ఒక రూపం లేవే | మనకనవసరం కాబట్టి | నిషేధించడం సాధ్యం కానివి కాబట్టి |
| 15 కొరియారంగానికి వెళ్ళివచ్చిన భారతసైన్యాలు మరల వెళ్ళవలసిన ప్రదేశం... | కాశ్మీరు | ఇండో-చైనా |
| 16 కాశ్మీరులో ప్లెబిసైటు తప్పనిసరి... | నెహ్రూ అంగీకరించాడు కాన | కాశ్మీరు మనకు వచ్చేది కాదు కాన |
| 17 మంత్రుల జీతాలు పెంచబడడమే న్యాయం... | హోదా అవసరం కాబట్టి | ఆ ఉద్యోగం మళ్ళీమళ్ళీ దొరకదు కాన |
| 18 పంచాయితీలు పరిశుభ్రంగా ఉన్నాయి... | గొడవలు పైకిలేవు కాన | తినేవాళ్ళసంఖ్యఎక్కువ |

కూపనులు ఎక్కడికి పంపినను మనియార్డరులు మాత్రం ఈ క్రింది యెడ్రసుకు పంపవలెను.

రాయబహద్దరు "స్పాంజిరావు" గలీజ్‌నగర్ (పోస్టు)
అస్పృశ్యపూర్ జిల్లా. (నవ్యాంధ్ర)

స్కెచ్

# ఊహలా _ పరిణామాలా

ఊటుకూరి రంగారావు

అద్దంలో ముఖం చూసుకుని, "నేనూ గొప్ప అందగాణ్ణే...కాకున్నా ఒకమోస్తరు అందగాణ్ణే" అని ఎవరికివారు అనుకోందే, సంతృప్తి పడందే జీవితాన్ని ఆనందంగా వెళ్ళబుచ్చలేరు సరికదా, చివరికి బతుకంతా నరకమయి కూర్చుంటుంది. స్త్రీలే కానివ్వండి, పురుషులే కానివ్వండి, తమతమ గొప్పదనాన్ని గురించి, తమ ఉనికిని అందాన్ని గురించి, తప్పుడు అంచనాలు వేసుకుని సంతృప్తిపడడం మామూలు విషయమే. ఈ సంతృప్తి ఒకోసారి తనస్థానాన్ని గుర్తింపనీయక వ్యక్తి జీవితాన్ని అరణ్యంపాలుచేసి, చీకటి దారుల్లో పట్టించి, జగత్తులో తలనెత్తకుండా చేస్తుందనడం అబద్ధంకాదు. కాని, ఇదేలేనినాడు ఈ మానవుల జీవితాలన్నీ కేవలం ఎండిపోయిన చెరువుల లోపలిభాగాలై, స్మశానాలై, బూడిద రాసులు కావడానికూడా అభ్యంతరం లేదు.

ఎవరెలావున్నా, ఏంచేసినా, ముఖ్యంగా నేనుమాత్రం చాలా గొప్పవాణ్ణనే నాలో అనుకుంటూ వుంటాను. 'నేను గొప్పవాణ్ణి' అనుకోనిదే నేనొక్క నిముషం, ఒక్కక్షణం బతకలేను.

* * *

మా ఆంజనేయులీమధ్య ఒక నాటక సమా

జాన్ని స్థాపించి, ఊళ్లోవున్న ముగ్గురు ఫిఫ్తుఫారం తప్పిన స్టూడెంట్లని ముఖ్యసభ్యులుగా చేర్చుకుని కళారాధనచేస్తున్నాడని కర్ణాకర్ణికంగా వింటూనే వున్నాను. వాళ్ళ సమాజం, ఈ మధ్య నాలుగైదుచోట్ల ప్రదర్శనాలుకూడా యిచ్చిందనీ, కొంత డబ్బుకూడా పోగయిందనీ వినికిడి. ఆ నాటకాలెలావున్నా, పౌరాణికాలు కాబట్టి పల్లె ప్రజలు సహించి, దేవతల వేషాలు చూసి ఆనందిస్తారు కాని డబ్బు దండగైనా దండగని అనుకోరు. వాళ్ళ సమాజం నాలుగుకాలాలపాటు వర్థిల్లి ఇతోధిక కళాసేవజేసి, ప్రజల మన్ననలను పొందాలని ప్రముఖులు సందేశాలుకూడా పంపుతున్నారని అప్పుడప్పుడు ఆంజనేయులి ఉత్తరాలద్వారా తెలుస్తుంటుంది నాకు. గోదావరి వరదబాధితుల నిధి పేరుతో ఈ మధ్య వాళ్లూ నాటకాన్ని వేస్తే చాలా మొత్తం వసూలైందట. ఆ డబ్బు నిధికి జమకట్టించబడిందో, లేదో అదంతా మన కనవసరం. మహామహా గొప్పవాళ్ళే డబ్బుదగ్గర గడ్డితిని, సంఘాల డబ్బుని సొంత ఖాతాలకితోసి పారేస్తుంటారు సహజంగానే. ఇక ఆంజనేయులు సంగతేమిటి? ఏదో ఇంత కళాసేవా, ఇంత భుక్తీ— ప్రపంచమ్మీది లక్షలన్నా జేబుల్లో వేసుకోవడంలేదు. అయినప్పుడు వాడికి గిట్టనివాళ్ళు చెప్పేమాటలు నే నెలానమ్మను? నాటకాలువేస్తూ వాడు కీర్తిప్రతిష్ఠ లార్జిస్తున్నాడనీ, ఇంకా రెండేళ్ళుపోతే వాడో గొప్ప క్యారెక్టర్ యాక్టరయి సినిమా తెరమీద అతుక్కుపోతాడనీ అనుకుని, వాడి గొప్పతనానికి యీర్ష్యపడేవాళ్ళంటూ లేకపోలేదు. అసలు ఆంజనేయులు రాసే వుత్తరాలు చూస్తూంటే వాడు తనో చార్లీఛాప్లిన్‌గా భావించుకుని రాస్తూన్నట్టు కనపడుతుంది. అనుకోనివ్వండి. మనకేం నష్టం? ఆ మాటకొస్తే మనం మాత్రం "గొప్పవాళ్ళం" అనుకుని లోలోపల మురిసిపోవడం లేదా?

అ వాళ్ళో గొప్ప సాంఘికనాటక ప్రదర్శనం ఎరేంజ్ చేశామనీ, ఈ నాటకం బహు బ్రహ్మాండంగా, ఎంతో వ్యయప్రయాసలమీద తయారయిందనీ విపరీతమైన పబ్లిసిటీమూలంగా వేలాది ప్రజానీకంవచ్చే సూచనలు కనిపిస్తున్నాయనీ తప్పకుండా వచ్చి ఈ ఒక్కరాత్రివుండి నాటకం చూసి, అమూల్యమైన సలహాలిచ్చి కళోద్ధరణకి పాటుపడమనీ ఒక పెద్ద ఆహ్వానపత్రాన్ని స్వదస్తూరీతో వ్రాసి పంపాడు ఆంజనేయులు. మంచో చెడో గౌరవించి, మనకూ ఓ పెద్దరికాన్నిచ్చి ఆహ్వానించినప్పుడు, గౌరవంగానే స్వీకరించాలి. ఇదీ గొప్ప. చిన్నగా థర్డుక్లాస్ టికెట్టొకటి పుచ్చుకుని బండికి తయారయాను. గురుతుల్యులైన డాక్టర్‌జీ, పట్టణ ప్రముఖులైన ప్లీడరు మూర్తిగారుకూడా అదే బండిలో ప్రయాణం చేయడానికని వెయిటింగ్‌లోవున్నారు. ఆమాటా ఈమాటా మాట్లాడుతూండగానే రైలువచ్చి నిలబడింది. వాళ్ళిద్దరూ సెకండ్‌క్లాస్ మనుషులు. వాళ్ళతో నేను సెలవు తీసుకోబోతూంటే డాక్టర్ నన్ను బలవంతపెట్టి తమకంపార్టుమెంటులోకి లాగాడు. నాది మూడవతరగతండీ అన్నాన్నేను. ఎక్సెస్‌ఫేర్ చెల్లిద్దాం పరవాలేదులే అన్నాడు డాక్టర్, గొప్పవాణ్ణనిపించుకోవాలనే కుతూహలం నాకూ వుందని మొదలే మనవిచేశానుగదా? సెకండ్‌క్లాస్‌లో ప్రముఖులపక్కన ప్రయాణంచేయడం గొప్పతనమేగా మారుమాట్లాడకుండా ఎక్కేశాను. ఈ 'గొప్ప'దాహం వుంది చూశారూ, మనిషినొక్కోసారి మందమతిని చేసి తడబాటుపడేస్తుంది. గొప్పకోసం పోతే కొద్దికూడా మిగలకుండా పోతుంది. మన పిచ్చివేషాలన్నీ అవతలవాళ్ళు ఒక "ఫార్సు"గా చూస్తుంటారు. మనమేమో మెప్పుకోసం ఇంకా పిచ్చితనానికి పోతాం. నేనూ కొంచెం జాగ్రత్తగా బతికేవాణ్ణే కాబట్టి, అస్తవ్యస్తపు పిచ్చివేషాలు వేయకుండా, బుద్ధిమంతుడిలా ఓపక్కన డాక్టర్‌గారి సరసని కూర్చున్నాను, ఎక్కణ్ణించి వచ్చాడోగాని యమకింకరునిలా వచ్చాడు టి. సి, టిక్కెట్లు చూస్తూన్నాడు. అన్నిటికీ మాడాక్టగారున్నాడుగదా, గొప్పవాడు కాదంటే ప్లీడరున్నాడు. ఈ గొప్పవాళ్ళపక్కనగల గొప్పవాణ్ణి నాకేమిటి బెడద అనుకుని, నిరాక్షేపణీయంగా తలెత్తకుండానే థర్డుక్లాసు టికెట్‌ని టి. సి. కిచ్చేశాను. బండి ప్లాట్‌ఫారంమీద ఆగినప్పుడు ఎక్సెస్ మెమో రాయడం అనవసరం అనీ, వెళ్ళి, టికెట్టు కొత్తది తెచ్చుకొమ్మనీ ఆజ్ఞాపిం

చాడు. డాక్టర్ జీ తన పలుకుబడితో దగ్గరున్న మా కోమఱ్రాజుకి టికెట్టిచ్చి సెకండ్ క్లాస్ తెచ్చి పెట్టమని డబ్బిచ్చారు. ఆయనలా వెళ్ళాడో లేదో బండి కదిలి పరుగెత్తడం మొదలెట్టింది. దీంతో నాకిదివరకున్న మూడోతరగతి త్రైసెన్సుకూడా వూడిపోయి అసలే టికెట్ లేని ట్రావెలర్ నయాను. రెండోసారి టి. సి. వచ్చి టిక్కెట్టడిగేవరకే నా మర్యాద సగం ఇదయినట్టయింది. మెమో వ్రాస్తాను, మూడవతరగతి టికెట్ నెంబర్ చెప్పమన్నాడు. అసలు టిక్కెట్టేదీ నాదగ్గర...? ఇక చూడండి, మొదలైంది రభస. అంతా టి.సి.తో సహా గొప్పవాళ్లేనాయిరి. ఎవళ్లూరుకుంటారు? నీది తప్పంటే నీది తప్పని వాదం బయలుదేరింది. ఇంతలోనే మేం దిగాల్సిన స్టేషన్ వచ్చేసిం . టి. సి. గాడు నా వెంటపడి పైనుంచి డబుల్ చార్జి వసూలుచేయందే వదలడనుకున్నాను. మేం బండి దిగగానే రెండడుగుల్లో మా ప్లీడరుగారి మిత్రుడు అక్కడికి క్యాంపువచ్చిన రైల్వేపోలీస్ సర్కిల్ ఇనస్పెక్టర్ ప్లాట్‌ఫారంమీద కలిసి, వాళ్ళిద్దరికీ షేక్‌హాండిస్తూ నాకూ ఓటి పారేశాడు. ఇంతలో టి. సి. త్వరగా మా కంపార్టుమెంటువద్దకి వెళ్ళి మేము దిగిపోయింది చూశాడల్లేవుంది వెదుక్కుంటూ వస్తూవస్తూ, మమ్మల్ని అక్కడ ఆ ఘరానావ్యక్తికి చేతులు కలుపడం చూసి, గతుక్కుమని వెనక్కితిరిగాడు. వాడి మనస్సులో మమ్మల్ని ఎన్నిరకాలుగా తిట్టుకున్నాడో అర్థంకాదు కాని, మొత్తానికి ఓ క్రూర దృష్టినొకదాన్ని తాచుపాము నాలికలా మా మీద వదిలి రైలుతోసహా పరారీ అయాడు. "అమ్మయ్య" బతికాననుకున్నాను.

గొప్పవాళ్ళిద్దర్నీ వాళ్ళ పనిమీద వాళ్ళని పంపి, తీరా నేనిటు ముఖం తిప్పిచూతునుగదా, మా ఆనందంగాడు తయారు. "ఓరినీ! నీవెందుకొచ్చావ్?" అన్నాను ఆశ్చర్యంగా.

"నీవెక్కడికో నేనూ అక్కడికే" అన్నాడు వాడు. "ఐతే, ఆంజనేయులు నీకూడా రాశాడన్నమాట?" అన్నాను, అక్కడికి వాడు నాకంటే తీసిపోయిన మనిషైనట్టు.

"అవునుగాని, ఈ నిర్జనారణ్యంలో ఎందుకూ టైం వేస్ట్. మనం ఇక్కన్నించి ఇంకో మూడు మైళ్ళు బస్ మీద వెళ్ళాలి. బస్ చెక్కేసింది... వెధవబస్సు. బండి లేటయిందంటే బస్సు అందదిక్కడ" అన్నాడు ఆనందం తేలముఖంతో.

ఈ మూడుమైళ్ళూ నడిచివెళ్ళవలసి వుంటుందనే భావం నాకు దానంతటదే కలిగింది ఆలోచించకుండానే. గొప్పవాణ్ణిగదూ? ప్రతీదీ ఆలోచిస్తే ఎలా? తక్కున జవాబు రావాల్సిందే. ఆనందంగాడు బండీ ఏదన్నా దొరుకుతూందేమోనని ఆలోచిస్తూన్నాడు. వెధవముఖం... మీన్ ఫెలో. వాడి జబ్బపట్టి రోడ్డుమీదికి లాగి కాళ్ళకి పని కల్గించాను.

తిన్నగా మేం చేరుకోవలసిన చోటికి చేరుకునేవరకే ఉదయం పదకొండు గంటలు దాటిపోయింది. ఆంజనేయులు మాకు సుస్వాగతం సమర్పించాడు. ఎన్నో సపర్యలుచేశాడు. భోజనాభాజనాదులన్నీ సమకూర్చాడు. ఆలోచనల బరువులు దిగిన స్వేచ్ఛతో విశ్రాంతి ననుభవించేవరకే సూర్యుడు క్రుంగిపోయాడు.

"ఒరే! ఇవాళ నావేషం ఎలా వుంటుందో తెలుసా?"

నాచేత పొగిడించుకుని, గొప్పవాణ్ణనిపించుకోవాలని వాడిఊహ. అది నేనెందుకాదనాలి? నాకు మాత్రం ఈ జబ్బులేదనా? వుంది. అందరికీ వుంటుందని రాయిగుద్ది చెప్పగలను. కావాలంటే రూపాయి స్టాంపుమీద వ్రాసిస్తాను.

"భేషుగా వుంటుంది. నీ వేషానికేం? నీలాంటి ఉత్సాహవంతులు నలుగురుంటే కళాత్మకంగా దేశం విరాజిల్లడానికి ఎంతసేపురా?" అన్నాను కొంచెం వ్యంగ్యంగా. నాఫలోక్తులూ వ్యంగ్యాలూ ద్వంద్వాలతో వాడికేం పని? వాడిది ఒకే ఒక లక్ష్యం. తను గొప్పవాడు కావాలి. ఇప్పుడు కాలేదని వాడనుకోడు సుమండీ! ఇంతకన్న గొప్ప కావాలి. తన వేషమూ, తన నటనా చూసి ప్రేక్షకులు ఉఱ్ఱూత లూగుతారనే వాడి దృఢ విశ్వాసం... ఇన్నాళ్ళూ వాడి స్వంత వూరూ, చుట్టుపట్ల వూళ్లలో నాటకాలాడబట్టి, వాడికి తన స్థాయి అర్థంకాలేదు. ఎంత చెడ్డా పొద్దున్న లేస్తే కనపడుతూ సోదరుల్లా మెలిగే వాండ్లలో స్పర్థలు పనికిరావని వాళ్లు క్షమించి వుండవచ్చు. కాని, ఇది వాడికి కొత్త వూరే... జూరిస్ డిక్షన్

వదిలి; యీ రోజున యీ సెంటర్‌లో నూతన నాటకాన్ని ఆడాలని అంతదూరంనుంచివచ్చాడు బృందంతో సహా. నా అభిప్రాయం మట్టుకు, ఆంజనేయులు నటకుడైందీ కానిదీ, ఈ అపరిచిత ప్రదేశంలో తేలిపోతూందని...అంతే కాదు... వాడు కొంపదీసి కళారంగంలో ఇక కాలు పెట్ట డేమోనని నా భయం. వాడివాళ కొండంత ఉత్సాహాన్ని మోస్తున్నాడు. తన వేషమూ తన నటనా ప్రజల్ని వుర్రూతలూగిస్తుందని ఊహించు కుని సంతృప్తిపడుతూ ఎలాగో మాతో కలిసి భోజనం పూర్తి చేశాడు. భోజనం అప్పుడైనా మమ్మల్ని తదేకంగా తిననిచ్చా డనుకున్నారా? పట్టెడి...వాడి ఉపన్యాసంతోనే మా పొట్ట సగం నిండింది.

ఆంజనేయులి హంగామా చూసి ఆనందం "ఏరా బ్రదర్! నీవు ఇంతలో ఎంత గొప్పవాడై పోయాడే. నాటక కళానిష్ణాత సుమా?" అన్నాడు.

"ఓ బ్రహ్మాండ నాయకుడులే. కాని వాడి, అభిమానపాత్రమైన ప్రాతలు ఏవీ వాడి సమర్థత నిరూపించడానికి వీల్లేనివని నా అభిప్రాయం" అని చెప్పాను. రాత్రి భోజనమైన తర్వాత ఆంజ నేయులి దర్శనం మళ్ళీ మాకు లేదు.

రాత్రి పదిగంటలకి నాటకం మొదలైనది. నేనూ ఆనందం నాటకం పాకదగ్గరికి వెళ్లాం... "డబ్బివ్వలేనివాడు దబ్బున రైట్లో జాగా సంపా దిస్తాడు" అన్నట్టుగా చక్కనివి రెండు కుర్చీలు ఆక్రమించుకున్నాం మేమిద్దరం. జన సముద్రం విపరీతంగా వుంది. అదో రాజకీయపు రంగులు గల సాంఘిక నాటకం. చుట్టుపట్లనుండి ప్రజలు అపరిమిత సంఖ్యలో వచ్చారు. ఉద్యోగస్థులూ, పోలీసు అధికారులూ తమతమ బృందాల్తోసహా ముందువరుసలో కూర్చొని, వాళ్ళ టోపీలని వెనకవాళ్ళ కళ్ళకి అడ్డంవేస్తున్నారు. ఈ పోలీసు అధికార్లతో ఇదే చిక్కు. తమ గొప్పతనంకింద ప్రజల గొప్పతనం అణగిపోవాలంటారు. కాదంటే బాజా మొదలెడతామంటారు...అయినా వాళ్లు శాంతి రక్షణకు ఆటంబాబులలాంటివాళ్లుకాబట్టి, నాటకంలో ముందుసీట్లు తప్పవు...ఒకళ్లిద్దరు కాదు...ఎలాగో సందుచేసుకుని మే మిద్దరమూ ముందు వరసలోనే పడిపోయాం....

ఆంజనేయులి వేషంవచ్చింది. అదో జమీం దారు పాత్ర. ఒక్కమాటలో చెప్పాలంటే, వాడి వేషం రంగాన్ని అలంకరించిందోలేదో ప్రేక్షకుల్లో ఒక్కసారి గొల్లున ధ్వని వినవచ్చింది. ఒక్కటే రొద. ఏమిట్రా దీనికిమూలం అని చూస్తే, వాడి డ్రెస్సింగులో పొరబాటు జరిగింది. ముందుభాగం షర్టు ప్యాంటు లోపలికి వేశాడు. వెనకభాగం అలానే మరచిపోయి బయటనే వుంచాడు. ఎంత సేపటికీ వాడది చూసుకోడే! ప్రేక్షకుల రొద బ్రహ్మాండం పగిలిపోతోంది. ప్యాంటు, ఇన్ షర్టు... జమీందారు...ఒకే కేకలు... అబ్బబ్బ! ఇదంతా ప్రేక్షకులు తనకిచ్చే ప్రోత్సాహమను కున్నాడేమో ఆంజనేయులు... పిచ్చివాడిలా ఇంకా ఎన్నో వింతవింత నటనలు మొదలెట్టాడు. కర్మానికి తగ్గట్టు వాడికో కొద్దిపాట నాటకంలో లేనిదాన్ని తగిలించారు. పాట మొదలెట్టాడు. మణుగున్నర కంఠంతో మైకుముందు నిలబడి పాడుతోంటే ప్రజలకి అది పాటా లేక ఏదన్నా జలపాత ధ్వనా అనిపించింది. ఒకరాగంలేదు, ఒక భావంలేదు, సంగీతంలేదు కేవలం ఒకేఒక ధ్వని. నాకు తెలుసు ఆ పాటను అలాపాడడానికి వాడు హార్మోనిస్టుని ఎన్నాళ్ళు ఏడిపించాడో...

నేనూ ఆనందం ఆరాత్రి ఆంజనేయులి బసకు వచ్చి పడుకున్నాం. వాడుఇంటికే రాలేదు

ఆనందానికి బయలుదేరివచ్చినప్పుడున్న ఉత్సాహం ఇప్పుడులేదు. పొద్దున్నే లేచాం. మొదటి బస్‌లో నేస్టేషన్‌కు వచ్చేద్దామనుకున్నాం లేకుంటే నిన్నటిలా మళ్ళీ నడవాలంటే చచ్చా మన్నమాట. దంతధావనం పూర్తయేసరికి మా ఆంజనేయులు అమాంతం మా ముందుకు దూకాడు. ముఖానికివేసుకున్న రంగింకా ప్రయ త్నపూర్వకంగా అక్కడక్కడ మిగిల్చినట్టుగా వుంది. వాణ్ణిచూస్తే నాకు జాలివేసింది. రావటం "ఎలా ఉందిరా రాత్రి నా నటన?" అన్నాడు.

"ఓ. భేషుగ్గావుంది... నీ పేరుకితగ్గ హుందా తనంగావుంది" అన్నాడు మా ఆనందం. అవు నవునన్నా నేను. వాడిపాత్రకి తగినట్టుందని దాన్ని వాడర్థం తీసుకున్నాడు, తన గొప్పతనాన్ని ఫీల్ చేసే వాడెప్పుడూ ఇతరుల వ్యంగ్యాన్ని గమనించ లేడని మనకితెలుసుగా? ఈ ఊపుతో వాడిముఖం

విప్పారింది. ఇంతమాత్రం ప్రోత్సాహకరంగా వాడికి ఈపూట వినపల్లేదల్లేవుంది. వెంటనే మమ్మల్ని హోటల్‌కుఆహ్వానించాడు. బస్సుకూడా అక్కడే ఆగుతుందని అంతా కలిసివెళ్ళాం.

హోటల్లో రకరకాల టిఫిన్లకి వాడే ఆర్డర్లు యిచ్చాడు. హోటల్లో చాలా జనసమ్మర్దం... అంతా రకరకాలవాళ్లు... కొందరిదృష్టి మావాడి మీద పడడం, వాళ్ళు గుసగుసలాడుతూ నవ్వుకోవడం అంతా నేను కనిపెడుతూనే వున్నాను. ఆంజనేయుల్నింకా ఉబ్బిద్దామనే దృష్టితో మా ఆనందంగాడు మళ్ళీ భాగోతం మొదలెట్టాడు. "మీ నటన చాలా దర్జాగా సరిపోతుంది. అసలు కొందరికి ఊహకందని ఉదాత్తమైన సంకేత స్థాయితో మీరునటించారు. సామాన్యుడు దీన్ని అర్థం చేసుకోవాలన్నా, ఇంత ఉన్నతస్థాయిలో వున్న నటనని ఊహించుకోవాలన్నా మన దేశములో ఇంకొంతకాలం పోవాలి..." అన్నాడు ఆనందం ఒక్కబిగిన.

"నిజం. అలాగే ఉండాలి" అన్నాన్నేనూ ఇడ్లీ నములుతూ.

"ఏమిట్రా? ప్రజలు... వెధవ ప్రజలు?... వాళ్ళలో కళంటే వెతికినా కనపడదు. మనమేమో వాళ్ళకోసంపడిచస్తాం.నటించడం లలితకళ,అంతా అర్థంచేసుకోలేరు"అన్నాడు ఆంజనేయులు అదో రకం సంతృప్తిగా ఠీవిగా నాలుగువేపులాచూస్తూ.

మా ముందున్న అరడుగుల మీసాలవిగ్రహం. కాఫీగ్లాసు బల్లమీద పెట్టి, అదోరకంగా మా ఆంజనేయుల్ని చూస్తున్నాడు, మావాడిమాటలు శ్రద్ధగా వింటున్నట్లు. "నీవేనా రాత్రి జమీందారువేషం వేసింది?" అన్నాడు కొంచెం కటుస్వరంతో. ఈ ఏకవచన ప్రయోగం ఆంజనేయుల్ని కొంచెం బాధించింది. కాని, ఆయన తననటననుగురించి ఏమన్నా అభిప్రాయం తెలియచేస్తాడేమోననే ఆదుర్దాతో "అవునండీ! నేనే, ఏం? బాగాలేదూ? చివరిసీనులో మాంచి క్లైమాక్సులో పడ్డదిలెండి, అసలా సీనంతా నాటకానికిప్రాణం" అని గుక్కతిప్పుకోకుండా ఉపన్యాసం సాగించాడు..."ఏమిట్రా? వీడికింత పిచ్చి? మామూలుకన్నా మించిపోతూన్నట్టుందే? అదేమిటో ధోరణి?"అంటూ ఆనందం రహస్యంగా నా బుజంగిల్లాడు. ఆంజనేయులు వాగ్ధోరణి సాగింది... చివరికి ఆగిపోయింది.

ఎదుటి ఆసామీని ఉద్దేశించి "పిడో రౌడీ వెధవో, లేక తాటాకు నాలికవాడో అయి వుంటాడు. పంచాయితీ అనవసరం" అన్నాడు ఆనందం నా చెవిలో... నాకుమాత్రం వాడితో పంచాయితీపెట్టుకునే దమ్ముండి చచ్చిందీ?... ఆంజనేయులు బాధపడతాడేమోనని నాచింత. ఆసామీ. ఆంజనేయులూ, మాటలుదాటి చేతులు కలిపారు... నాటకాన్నిగురించే.

మాపుణ్యంబాగుండి.ఇంతలో మేం వెళ్లాల్సిన బస్‌వచ్చి ఆగింది. ఆ మీసాలాయన త్వరగాలేచి మావాణ్ణి మళ్ళీ ఒక్కసారి ఉరిమిచూసి, అమాంతం వెళ్ళి బస్సులో ఫ్రంటుసీటులో బైఠాయించాడు. మేం వెనక్కితగ్గి, "వెళ్తాంరా ఆంజనేయులూ" అన్నాం... "ఛా! వట్టి వెధవలు మీరిద్దరూ..పొండి!" అన్నాడు...వాడిఅమాయకత్వానికి నాకు ఏడుపొచ్చింది... ఏం చేయాలి చెప్పండి? వాడితోపాటు మేమూ తన్నులు తినడానికి సిద్ధపడలేదని వాడిగోల. తిన్నగా బస్‌లో ఎక్కబోతూంటే "మనకూడా నాటకంవాళ్లమేననుకుని, ఆ మీసాలవాడు బస్‌లో పట్టుకుని మనల్ని తంతాడేమోరా?" అన్నాడు ఆనందం. నేనూ సంశయించానుకాని, ఈ బస్సుతప్పితే ఇక మాకు రైలులేదు మళ్ళీరాత్రిదాకా...తప్పనిసరిగా కూర్చున్నాం గప్‌చిప్‌గా...ఆంజనేయుల్ని వాడిగతికివాణ్ణివదిలి మా బస్సు కదిలింది... అంతక్రితం మీసాలాయనతో మాట్లాడుతున్న ఒక పెద్దమనిషి మా పక్కనే వచ్చి కూర్చున్నాడు. ఆయన్ని ఆరాతీస్తే "ఆ మీసాలాయన నిన్ననే కొత్తగా ఈ ప్రాంతానికి బదిలీఅయివచ్చిన పోలీస్ సర్కిల్ యినస్పెక్టరని తెలిసింది. సివిల్ డ్రెస్సులో వున్నాడు. ఏదోపనుండి వచ్చాడట స్వంతపని... గుండెలు గతుక్కుమన్నాయి. "మనరోజులు మంచివి. మనిద్దరంకూడా చెయిచేసుకోలేదు" అన్నాడానందం.

తనకుతాను గొప్పగా ఊహించుకుని మనిషి పాలవుతాడో ఆలోచిస్తూ 'అవునే' అన్నాను. అయినా నేనుమాత్రం గొప్పవాణ్ణికాదని నేననుకోకుండా వుండలేను... ★